తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

బుధవారం

11 ఫిబ్రవరి 2026

Follow :





## ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి

# మా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

- ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో జవాబుదారితనం, బాధ్యతతో పనిచేస్తున్నాం
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఐటీ, ఇండస్ట్రియల్ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**హయత్ నగర్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** ఎల్బీనగర్ నియోజకవర్గం లో సుమారు 45 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు ఐటీ, ఇండస్ట్రియల్ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, బొగ్గారపు దయానంద్, కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, బానోతు సుజాత నాయక్, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ నగరంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సదుపాయాలను మెరుగుపరుచుతున్నామని వారు అన్నారు. ఇందులో భాగంగా బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లైఓవర్ల నిర్మాణం, నాలాల విస్తరణ చేపడుతున్నట్లు వారు వివరించారు. రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు అవసరమైన చోట్ల బ్రిడ్జిలను నిర్మిస్తున్న తీరును వారు తెలిపారు.

గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రతి నెల రూ. 6700 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లిస్తున్నామని, ఆ డబ్బులను ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తే ప్రజలకు ఎంతో మేలు జరిగేదని చెప్పారు. బీఆర్ఎస్ లో మాదిరిగా కాకుండా ప్రతి నెలా మొదటి రోజునే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్న ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వం దేనిని వారు తెలియజేశారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గం లో మధుయాష్కీ నేతృత్వంలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని వారు అభినందించారు. ఉప్పల్, ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో రూ. 760 కోట్ల నిధులతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. వారు అడిగిన ప్రతి అభివృద్ధి పనిని చేసి పెట్టినట్లు, గతంలోనూ ఇళ్ల నిర్మాణం చేపట్టి వనస్థలిపురం లాంటి టౌన్ షిప్ లను నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, ఇప్పుడు కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదలకు ఇంటి వసతి కల్పిస్తున్నట్లు వారు వివరించారు. మధుయాష్కి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ 5 ఏళ్ల పాలనలో ఎల్బీనగర్ నియోజకవర్గం లో కేవలం ఉప్పల్, ఎల్బీనగర్లో రూ. 400 కోట్ల నిధులతో మాత్రమే అభివృద్ధి చేపట్టగా, కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలనలో రూ. 760 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసిన ఘనత తమదేనని సంతోషాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే తాను రౌడీయిజం చేస్తే ఎవరూ ఉండరని చెప్పుకుంటున్న ట్లు తెలిసిందని, కానీ ఆయనకు చెడ్డీ లేని రోజుల్లో తాను, పట్నం మహేందర్ రెడ్డి కాలేజీ రోజు లలోనే అవన్నీ చేసామని వారు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే బాగుండదని వారు హెచ్చరించారు. తాము ఎవరిపైనా రాజకీయ కక్ష సాధింపు లకు, అక్రమ కేసులను ప్రోత్సహించడం లేదని వారు గుర్తు చేసుకోవాలన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్తున్నామని వారు వివరించారు.

# సమస్య మీది పరిష్కారం మా బాధ్యత

- వాహనాల స్పీడ్ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు
- దేవనూర్ సర్పంచ్ రేణుకదేవి కిషన్ రావ్



**తాండూరు ఫిబ్రవరి 10(జనంసాక్షి) :** యాలాల మండలం దేవనూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల మందు ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో నూతన రోడ్డును వేయించారు.

రోడ్డుపై వాహనాలు వేగంగా వెళుతున్నాయని గ్రామసభ లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు దీంతో వెంటనే స్పందించిన సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేయించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు మాట్లాడుతూ రోడ్డుపై వేగంగా వాహనాలు నడపడం ద్వారా బాటసారిలకు మరియు చిన్నారులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేయించామని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ సెలవు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిట ీలలో ఓటర్లుగా నమోదు అయి ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక క్యాజువల్ సెలవు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకు నేందుకు పోలింగ్ రోజైన ఫిబ్రవరి 11, 2026న ఓటు హక్కు కలిగి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక క్యాజువల్ సెలవు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్లుగా నమోదు అయిన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

# ముందు పరిహారం.. ఆ తర్వాతే సర్వే

## ముట్వారులో ఆగని రైతుల పోరు..

- తహసిల్దార్‌తో ఫోన్‌లో వాగ్వివాదం!
- నష్టపరిహారం తేలే వరకు రేడియల్‌రోడ్డు సర్వే జరగనివ్వం
- అధికారులను అడ్డుకున్న రైతులు
- రెండవ రోజు సర్వేను అడ్డుకున్న భూ భాదితులు





**కొందుర్గు ఫిబ్రవరి 10 (జనం సాక్షి) :** ప్రభుత్వం చేపట్టిన రేడియల్ రోడ్డు భూసేకరణలో భాగంగా కొందుర్గు మండలం ముట్పూరు శివారులో నిర్వహించిన సర్వేను రైతులు ఉద్ధృతంగా అడ్డుకున్నారు. తమకు చెల్లించబోయే నష్టపరిహారంపై స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు భూముల్లోకి అడుగుపెట్టనివ్వబోమని అధికారులను రైతులు తెగేసి చెప్పారు. ఇక వివరాల్లోకి వెళ్తే.. రేడియల్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూముల సరిహద్దులను నిర్ణయించేందుకు సోమవారం కొందుర్గు మండల తహసిల్దార్ అజాం అలీ సర్వేయర్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది ముట్పూరు గ్రామ శివారుకు చేరుకున్నారు. సర్వే పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతుండగా, భూములు కోల్పోతున్న రైతులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని సర్వేను అడ్డుకున్నారు.

మా భూములకు ప్రభుత్వం ఎంత నష్టపరిహారం ఇస్తుందో ముందుగా ప్రకటించాలి. మార్కెట్ ధర ప్రకారం న్యాయపరమైన పరిహారం ఇస్తారా? లేక ప్రత్యామ్నాయంగా భూములు ఇస్తారా? అనే విషయంపై స్పష్టత ఇవ్వాలి. అప్పటి వరకు సర్వే నిర్వహించడానికి వీల్లేదు" అని రైతులు అధికారులను డిమాండ్ చేశారు. అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా వెనుదిరిగారు.

రెండవరోజు మంగళవారం యధావిధిగా సర్వే కోసం మండల అధికారులు ముట్పూర్ గ్రామానికి చేరుకుంటున్నరనే సమాచారంతో రైతులు ఉలిక్కి పడ్డారు. ఈ క్రమంలో పలువురు రైతులు తహసిల్దార్ ఆజాం అలీకి నేరుగా ఫోన్ చేసి తమ ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "మాకు న్యాయ పరమైన నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పకుండా, మా వినతులను పట్టించుకోకుండా ప్రతిరోజూ సర్వేకు రావడం ఏంటి?" అని రైతులు ఫోన్‌లో నిలదీశారు. తమ భూములకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం లేదా ప్రత్యామ్నాయ భూమిని ప్రకటించిన తర్వాతే పొలాల్లోకి అడుగుపెట్టాలని స్పష్టం చేశారు.

భూమిని నమ్ముకుని బతుకుతున్న తమకు న్యాయం జరగకుండా సర్వే ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో పాటు, సమస్య తీవ్రతను గమనించిన తహసిల్దార్ ఆజాం అలీ మరియు ఇతర అధికారులు సర్వేను తాత్కాలికంగా నిలిపివేశారు. రైతుల వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతూ వారు అక్కడి నుండి వెనుదిరిగారు. పరిహారం విషయం తేలే వరకు అధికారులు ఎవరూ తమ భూముల్లోకి రావద్దని, అవసరమైతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని రైతులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# టిప్పర్ల పట్టివేత



**కేశంపేట, (జనంసాక్షి):** మండల పరిధిలోని బైర్ఖాన్ పల్లి గ్రామ శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు సిఐ నరహరి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తెట్టే కుంట తండా నుండి బైర్కాన్ పల్లికి మట్టిని తరలి స్తున్న టిప్పర్లను గుర్తించారు. టిప్పర్ డ్రైవర్లు కొండాని ప్రేమ్ రాజ్ , మనోజ్ యాదవ్ ల వద్ద మట్టి రవాణాకు సంబంధించిన ఎలాంటి ప్రభుత్వ అనుమ తులు లేకపోవడంతో వారిని విచారి ంచగా కల్వకో లు గ్రామానికి చెందిన కొండాని లక్ష్మణ్ మట్టిని త్రవ్వి విక్రయి స్తున్నట్టు గుర్తించారు. రెండు టిప్పర్ వాహ నాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేష న్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## కమ్యూనిటీ సెంటర్లకు మహర్దశ

# ఉప్పల్‌లో అభివృద్ధికి కొత్త ఊపిరి



**ఉప్పల్ ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** గతంలో ఎన్నడూ లేని విధంగా ఉప్పల్ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ సెంటర్లను అద్భుతంగా తీర్చిదిద్దామని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి తెలిపారు. తమ కృషితో డివిజన్‌లోని అన్ని కాలనీల్లో ఉన్న కమ్యూనిటీ సెంటర్లకు మహర్దశ పట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ డివిజన్‌లోని పలు కాలనీల్లో కమ్యూనిటీ సెంటర్ల నిర్మాణం, విస్తరణ పనులకు కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. సౌత్ స్వరూప్ నగర్‌లో కమ్యూనిటీ హాల్‌కు రూ.20 లక్షల వ్యయంతో అదనపు అంతస్తు నిర్మాణానికి, హనుమసాయి నగర్‌లో రూ.15 లక్షలతో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, సాయి బాబా కాలనీలో రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ అదనపు భవనం నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సౌత్ స్వరూప్ నగర్, హనుమసాయి నగర్, సాయి బాబా కాలనీలకు చెందిన పెద్దలు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, మహిళలు , కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమ్యూనిటీ సెంటర్ల అభివృద్ధితో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు మరింత సౌకర్యం కలుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# బీజేపీ అభ్యర్థి మృతి ఘటనపై ఆందోళన, నాయకుల అరెస్టు




**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ అధికార పార్టీ బెదిరింపుల కారణంగా మృతి చెందారని ఆరోపిస్తూ, భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో హరికిషన్, సోల్కర్ రెడ్డి, బండారు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, విజయ్ యాదవ్, అల్లి శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అప్రజాస్వామిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

## సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి



**అబ్దుల్లాపూర్‌మేట్, ఫిబ్రవరి 08 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన నాలుగు అప్రజాస్వామిక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. అనేక కార్మిక పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కరోనా సమయంలో రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని నిరసిస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఉమ్మడిగా ఈ నెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమ్మెకు సంబంధించి గోడపోస్టర్‌ను మంగళవారం అబ్దుల్లాపూర్‌మేట్ మండల కేంద్రంలో, సాయుధ పోరాట యోధుడు ధర్మబిక్షం విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతారాజు నర్సింహా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ముత్యాల యాదిరెడ్డి హాజరై, ధర్మబిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ, 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక నిర్ణయాలే తీసుకుంటోందని విమర్శించారు. ఆ నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, స్త్రీ--పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నోట్ల రద్దు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం వంటి చర్యలు కూడా ప్రజా వ్యతిరేక నిర్ణయాలేనని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాపాడే చట్టాలను రద్దు చేసి, బడా వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా నాలుగు దుర్మార్గమైన లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెలో వేలాది మంది కార్మికులు పాల్గొని, సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీరా హరిసింగ్ నాయక్, బీఓసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, బీఓసీ నాయకులు మేడవుల రాములు, పానుగంటి సాయిలు, మంగళపల్లి రవి, వడ్త్యా రమేష్ నాయక్, లింగం, అశోక్, పేరాల గోపి, ఏనుగోటి శేఖర్, హుస్సేన్, బాబు, తెరాల లక్ష్మి, ఏనుగోటి లక్ష్మి, వాసిరెడ్డి లక్ష్మి, ప్రియా, ఆంజనేయులు తదితర ఏఐటీయూసీ మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కమలానగర్‌లో సీసీ రోడ్లు, పార్క్ అభివృద్ధి

## పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్



**హయత్ నగర్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి లో భాగంగా 68.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, 10 లక్షల రూపాయల వ్యయంతో పార్క్ అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ "కమలానగర్ కాలనీ అభివృద్ధికి ఎప్పటి నుంచో ప్రత్యేక దృష్టి పెట్టాం. రోడ్లు, డ్రైనేజ్, పార్కులు, ఇతర మౌలిక వసతులన్నీ దశలవారీగా పూర్తి చేస్తున్నాం. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే మా లక్ష్యం. అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయి" అని తెలిపారు. కాలనీ వాసులు మాట్లాడుతూ "గత ఐదు సంవత్సరాల్లో కమలానగర్‌లో రెండు కోట్లకు పైగా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజ్, పార్కులు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మా కాలనీ రూపురేఖలు మార్చిన కార్పొరేటర్ కి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. మా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న ఆయనకు రానున్న రోజుల్లో కూడా మేమంతా అండగా ఉంటాం" అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టీవీ రావు, మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పుల్లమ్మ, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు ఉపేందర్, సంక్షేమ సంఘం సభ్యులు సుబ్బా రావు, మల్లికార్జున్, కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



**బొంరాస్ పేట, (జనంసాక్షి):** మండల పరిధిలోని సూర్య నాయక్ తం డాకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 20 లక్షల వ్యయ ంతో మంజూరైన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింలు, సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాండా ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల స్థలాల రక్షణలో హైడ్రా సహకారం

## కమిషనర్ రంగనాథ్‌కు కృతజ్ఞతలు




**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** నెక్నంపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ప్రజల బాగుకోరి వదిలిన పార్కులు తదితర స్థలాలను ఆక్రమణల నుంచి కాపాడేందుకు పూర్తి స్థాయి సహకారం అందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు రూ.30 కోట్ల విలువగల 1250 గజాల పార్కు స్థలం, 800 గజాల కమిటీ హాల్ స్థలం, 600 గజాల సెప్టిక్ ట్యాంకు స్థలాన్ని ఆక్రమణలకు గురి కాకుండా రక్షించడంలో హైడ్రా కీలక పాత్ర పోషించిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పద్మ, శ్రీనివాసన్, శేషేంద్ర, శివ, హైదర్ అలీ, నరసింహారెడ్డి, నితీష్, ఘౌస్, వసంత్, గోపాల్, ఆరిఫ్, సుజాత, సీత, లావణ్య, ఉష, విజయలక్ష్మి, సుప్రియా, పారిజాత, జ్ఞానేశ్వరి కలిసి కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## మండల విద్యాధికారి హరిలాల్

**బొంరాస్ పేట, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** విద్య బోధనలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి హరిలాల్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బురాన్ పూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో నిర్మించిన నూతన తరగతి గది భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి,ఉపాధ్యాయులు సిఆర్పి సోమ్లా పాల్గొన్నారు.



# ఈపీఎఫ్ ఎస్ పెన్షనర్ల 2వ రోజు ఆకలి కేకల ధర్నా




**ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** తెలంగాణ అల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన రెండు రోజుల ధర్నా మంగళవారం పెన్షనర్లు తమ కనీస పెన్షన్9,000 చెల్లించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ. పీ. ఎస్. పెన్షనర్ అసోసియేషన్ ల జాతీయ ఐక్య వేదిక ఎంప్లాయీస్ పెన్షన్ (1995) సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గత రెండు రోజుల గా అన్ని పి.ఎఫ్. కార్యాలయాల ముందు ఈ.పీ.ఎస్. పెన్షనర్లు ధర్నాలు నిర్వహిస్తున్నారు. "టాప్రా" రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు టాప్రా జిల్లా శాఖ కూకట్ పల్లి లోని సహాయ ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా రెండు రోజులుగా కార్యక్రమం నిర్వహిస్తుంది మంగళవారం చివరి రోజు. ధర్నాకు "ఈ. పీ. ఎస్. పెన్షనర్ అసోసియేషన్ ల జాతీయ ఐక్య వేదిక" ఛైర్మన్, టాప్రా వ్యవస్థాపక సభ్యులు, ప్రస్తుత గౌరవ అధ్యక్షులు, కార్మిక నాయకులు ఎం. ఎన్. రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ గత పదహారు సంవత్సరాలుగా ఈ. పీ. ఎస్. పెన్షనర్లు కనీస పెన్షన్ ను పెంచాలని చేస్తున్న పోరాటాలను ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయన్నారు. 2013లో ప్రతిపక్షంలో ఉన్న బీ. జే. పీ వారు తాము అధికారం లోకి వస్తే కనీస పెన్షన్ రూ. 3000 మరియు కరువుభత్యంతో సహాయ చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 2014 సంవత్సరం లో ఎవరూ డిమాండ్ చేయని రూ. 1000 పెన్షన్ ప్రకటించి చేతులు దులుపుకున్నారని ఆయన విమర్శించారు. పెరిగిన ధరలకు అను గుణంగా వృద్ధులైన ఈ. పీ. ఎస్. పెన్షనర్లు గౌరవప్రదంగా జీవించడానికి కరువుభత్యం తో కూడిన రూ. 9000 కనీస పెన్షన్ ను ప్రకటించాలని గత పన్నెడు సంవత్సరాల నుండి ఎన్ని విన్నపాలు చేసినా ప్రస్తుత ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని, ఇది ఈ. పీ. ఎస్.పెన్షనర్ల ఆగ్రహానికి కారణం అయిందని తెలిపారు, గత పార్లమెంట్ ఎన్నికల్లో వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వోటు వేయడం వల్ల కనీస మెజారిటీ ఆ పార్టీకి రాలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కన్ను తెరచి కనీస పెన్షన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రెండురోజుల ధర్నా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టాప్రా జిల్లా అధ్యక్షుడు బాలగంగాధరరావు మాట్లాడుతూ ఈ.పీ.ఎస్. పెన్షనర్లు కోరుతున్న కరువుభత్యం తో కూడిన రూ. తొమ్మిది వేల కనీస పెన్షన్ డిమాండ్ న్యాయం, అక్రమం అయితే ప్రభుత్వం ఆ విషయాన్ని పార్లమెంట్ సాక్షిగా నిరూపించాలని, అధికారికంగా ప్రకటన విడుదల చేయాలని చాలెంజ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు వి. చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి టి. నిరంజన్ లు మాట్లాడుతూ ప్రభుత్వం వహిస్తున్న ఉదాసీన వైఖరికి ఈ. పీ. ఎస్. పెన్షనర్లు సహనం కోల్పోతున్నారని, తమ జీవితాలను త్యాగం చేసి జాతి సంపద పెంపుదలకు కృషి చేసిన వృద్ధులను ఈ విధంగా హింసించే ప్రభుత్వం ప్రపంచం లో మరొకటి లేదని దుయ్యబట్టారు. ఈ రెండురోజుల ధర్నా కార్యక్రమాన్ని పర్యవేక్షించిన టాప్రా కూకట్ పల్లి ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కే. శంకరరావు, కే.ఎల్. రెడ్డి, టాప్రా బాచుపల్లి ఏరియా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకట రాజం, అక్బర్ అలీఖాన్, టాప్రా మల్కాజిగిరి ఏరియా కమిటీ కార్యదర్శి జి. ఆర్. విజయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ నిన్న జరిగిన ధర్నా కంటే ఈరోజు మరింత ఎక్కువ సంఖ్యలో పెన్షనర్లు పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తపరుస్తూ ధర్నా కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కనీస పెన్షన్ కోసం జరుగుతున్న ఈ పోరాటం ఆగదని, ముందు ముందు మరింత ఉధృతం చేస్తామని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేల్కొని పెన్షనర్లకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టాప్రా జిల్లా కోశాధికారి డి. మురళి మోహన్, ఆల్వాల్ కమిటీ కోశాధికారి సాన సురేందర్, ఇతర కమిటీల నాయకులు సత్తెయ్య, సాంబశివరావు, ఎస్. వి. నరసింహారావు, మోహన్, దాస్ గుప్తా, సూర్యప్రకాష్, రామలక్ష్మిరెడ్డి, ఎం.వి. నాగభూషణం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కే. శంకరరావు వందన సమర్పణ చేశారు.

## మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం



**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** శంకర్పల్లి మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి లోకేష్ తెలిపారు.రెండవ సాధారణ ఎన్నికల నియమావళి ప్రకారం పట్టణ పరిధిలోని 15 వార్డులో గాను 31 పోలింగ్ స్టేషన్ల సిబ్బందికి మంగళవారం పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్,పోలింగ్ కి సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ ఫ్యూచర్

### సిటీలో కట్టుదిట్టమైన భద్రత



**ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 10(జనంసాక్షి):** మున్సిపాలిటీలు మరియు మున్సిపల్ కార్పొరేషన్లకు జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలను పరిరక్షించి, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని ఆమన్గల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి , మొయినాబాద్ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించనున్నారు.ఈ చర్యల ద్వారా ఎన్నికల సమయంలో అక్రమ కార్యకలాపాలను అరికట్టి, ప్రజలకు భద్రతతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఉందని కమిషనర్ తెలిపారు.

## జాంబవంత్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ శంకుస్థాపన చేసిన

### కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్ నగర్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** హయత్ నగర్ పాత గ్రామంలోని తోట్ల బస్తీలో జాంబవంత్ యువజన సంఘం దాదాపు 36 లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో పాత గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని, ప్రజలు తనపై నమ్మకం ఉంచి కార్పొరేటర్‌గా బాధ్యతలు అప్పగించిన తర్వాత పాత గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా గత ఐదు సంవత్సరాలుగా నిరంతరం కృషి చేశానన్నారు. పాత గ్రామంలోని వివిధ వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రజక భవనం, జవహర్ లాల్ నెహ్రూ సీనియర్ సిటిజన్ భవనం, అభ్యుదయ యువజన సంఘం(అనుమాగల్), జాంబవంత్ యువజన సంఘం భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించడం, హయత్ నగర్ పాత గ్రామంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి మౌలిక వసతులను మెరుగుపరిచామని వారు తెలిపారు. తన కార్పొరేటర్ పదవీకాలం ముగిసినప్పటికీ, ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుండి పని చేస్తానని, ఈ కమ్యూనిటీ హాల్ భవనం స్థానిక ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడే కేంద్రంగా నిలుస్తుందని నేను ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బస్తీ వాసులు, కొంగరి నరసింహ, ఎర్ర నాగరాజ్, నర్సింగ్ రావు, అడివయ్య, యాదగిరి, బాలకృష్ణ, వెంకటేష్, నరేందర్, సావిత్రి, అనసూయ, శోభమ్మ, యాదమ్మ, బాలకృష్ణ, బిజెపి నాయకులు, బస్తీవాసులు, పాల్గొన్నారు.



## జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి
- తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొరివి బాలకృష్ణ ముదిరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విమలక్క



**మహేశ్వరం,ఫిబ్రవరి10(జనంసాక్షి):**నిరుద్యోగులకు సంబంధించిన జాబ్ క్యాలెండర్ ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అరుణోదయ సంస్కృతిక అధ్యక్షురాలు విమలక్క అన్నారు.మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు,తెలంగాణ గురుకుల టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి బాలకృష్ణ ముదిరాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని బాలకృష్ణ ముదిరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విమలక్క,కొరివి బాలకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు.జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ముదిరాజ్ విద్యార్థి సంఘం ప్రెసిడెంట్ లక్ష్మీ గారి ఆంజనేయులు, ఓయూ శంకర్, పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎన్టివిఎస్ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతి, సాయిలు, ఆంజనేయులు,డాక్టర్ జోలూరి శంకర్,భానోదు పాండురంగ,సాయినాథ్, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్కానగర్ డివిజన్‌లో అభివృద్ధి వెల్లువ

**ఉప్పల్ ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :** ఐదు సంవత్సరాల్లో రూ.126 కోట్లతో అభివృద్ధి పనులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చిల్కానగర్, ఈరోజు చిల్కానగర్ డివిజన్‌లో గత ఐదు సంవత్సరాల కాలంలో సుమారు రూ.126 కోట్ల వ్యయంతో విస్తృత అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోనే అత్యధిక నిధులు చిల్కానగర్ డివిజన్‌కు తీసుకురావడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈరోజు రూ.4 కోట్ల 48 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్తో కలిసి శంకుస్థాపనలు చేశారు. డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, డ్రైనేజ్ పైప్‌లైన్లు, కమ్యూనిటీ హాళ్లు, నూతన టాయిలెట్లు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు.



## అందరూ ఆహ్వానితులే..!

- చేగూరు ఉమ్మడి గ్రామ వెంకమ్మగూడలో..
- ఈనెల 15 నుండి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు షురూ



**నందిగామ (జనంసాక్షి):** మహాశివరాత్రి మహోత్స వాలను పురస్కరించుకొని నందిగామ మండలం లోని చేగూరు ఉమ్మడి గ్రామ వెంకమ్మగూడలో వెలసిన చారిత్రాత్మక పురాతన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 15 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ధరూర్ సతీష్ పటేల్, ఆలయ పూజారి వీరేశం స్వామి పంతులు సోమవారం తెలిపారు. ఈనెల 15వ తేదీన బహుళ త్రయోదశి నుండి ప్రారం భమై 19 వ తేదీ సాయంత్రం ముగింపు వరకు జరిగే వేడుకలకు భక్తులు అత్య ధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. 18 వ తేదీ బుధవారం జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శం కర్, పలువురు రాజకీయ ప్రముఖులు, ఆలయ అభివృద్ధి దాతలు, వ్యాపా రవే త్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## మహాదేవప్పది ముమ్మాటికీ కాంగ్రెస్ హత్యే...!!

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఒక గిరిజన బిడ్డ ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వం అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్షం గా ఎన్నికల్లో ఎదుర్కొనే ధైర్యం లేక, మానసిక వేధింపులకు గురిచేసిన మక్తల్ కాంగ్రెస్ గుండాల అరాచకాలను భరించలేక 6వ వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదకరమని, మహదేవప్ప మరణానికి కారణమైన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం. గిరిజన బిడ్డకు న్యాయం జరిగే వరకు, ఈ అన్యాయ పాలనకు బుద్ధి చెప్పే వరకు బీజేపీ పోరాటం ఆగదని హెచ్చరిస్తు న్నామన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనలో ఆఖరి శ్వాస దాక పోరాడి అసువులు బాసిన గిరిజన బిడ్డ ఎరుకల మహాదేవప్ప ఆత్మకు శాంతి చేకూరా లని కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాడ సానుభూతి తెలిపారు.

## కాప్రాలో ఘనంగా బీఆర్ఎస్ యువ నాయకుడు గోగికార్ శివకుమార్ జన్మదిన వేడుకలు

### మహిళలకు చీరల అందజేసిన గోగికార్ శివకుమార్



**కాప్రా, (జనంసాక్షి) :** కాప్రా డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు గోగికార్ శివకుమార్ జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శివకుమార్ శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లో 300 మందికి, కాప్రా ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో 400 మందికి, వంపుగూడ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 300 మందికి చీరల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి , కాప్రా డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్ , ఉప్పల్ మైనారిటీ నాయకుడు బద్రుద్దీన్ , బిఆర్ఎస్ పార్టీ నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి నాయకుడు రాగి ఎట్లా కృష్ణ( కిట్టు) ఇతర నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో దూసుకుపోతున్న హయత్ నగర్

- డివిజన్ ను అభివృద్ధి చేయడం నా బాధ్యత
- నేను ఎప్పుడూ ప్రజా సేవకున్నే
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**హయత్ నగర్, (జనంసాక్షి):** హయత్ నగర్ డివిజన్ లోని మహేశ్వరి కాలనీలో 31.00 లక్షలు, పద్మాలయా కాలనీ 25.60 లక్షల 60 వేలు, సూర్యనగర్ ఎక్స్‌టెన్షన్ 25.50 లక్షల యాభై వేలు , బ్లడ్ బ్యాంక్ కాలనీలలో 43 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సూర్యనగర్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ సదుపాయం కల్పించేందుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ మురుగు నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో మరింత సమస్యలు ఏర్పడి దుర్వాసనలు, దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. "ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతకు భంగం కలిగించే డ్రైనేజ్ సమస్యలను పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నాం. ప్రతి కాలనీ అభివృద్ధి చెందడం నా బాధ్యత. గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాను. డివిజన్ మొత్తాన్ని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతాం" అని తెలిపారు. డివిజన్ ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని ఒక పదవిగా కాకుండా గొప్ప బాధ్యతగా భావించి గత ఐదు సంవత్సరాలుగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రతి సమస్యను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే దిశగా పని చేశానన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, వివిధ సంఘాల భవనాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి ఎన్నో పనులు చేపట్టి డివిజన్ అభివృద్ధికి కృషి చేశానాని వారు తెలియజేశారు. రానున్న రోజులలో ప్రజల ఆశీస్సులు, సహకారంతో ఇదే సేవాభావంతో ముందుకు సాగుతూ ప్రతి కాలనీ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సేవే లక్ష్యమని స్పష్టం చేశారు.

**కాలనీల వాసులు మాట్లాడుతూ**



"మా సమస్యలను వెంటనే గుర్తించి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిన కార్పొరేటర్ కి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజ్ సమస్యకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం లభించనుందని, రానున్న రోజులలో కూడా కళ్లెం నవజీవన్ రెడ్డి కి మేము ఎల్లప్పుడూ అండగా ఉంటాము" అని వారు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, కాలనిల అధ్యక్షులు శంకర్ గౌడ్, జానారెడ్డి, బన్నోత్ భాగ్య నాయక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మురళీధర్ రెడ్డి, నరసింహ గౌడ్, కళ్యాణ్ రెడ్డి, మల్లేష్ గౌడ్, కాలనీవాసులు, పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు మోసాల పట్ల అప్రమత్తత అవసరం

- కేవైసీ అప్డేట్ చేసుకోవాలి
- ఎల్.డి.ఎం యాదగిరి




**బొంరాస్ పేట, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** ఎస్బిఐ లీడ్ బ్యాంకు వికారాబాద్ వారి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో కేవైసీ ప్రాముఖ్యత,కేవైసీ రకాలు ,సైబర్ నేరాలు,మోసాలపై ఖాతాదారులు ,ప్రజలకు ఎల్.డి.ఎం యాదగిరి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఒక్క ఖాతాదారుడు కేవైసీ అప్డేట్ చేసుకోవాలని,బ్యాంకు నుండి మాట్లాడుతున్నామని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే వారి వలలో పడొద్దన్నారు.బ్యాంకు నుండి ఎలాంటి లింకులు పంపడం కానీ, ఓటీపీలు కానీ అడగరన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు రజినీకాంత్,ఎంపీడీవో వెంకన్ గౌడ్,స్థానిక సర్పంచ్ వీరేశలింగం పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనశ్శాంతిని కలిగిస్తాయి

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** ఆధ్యాత్మిక కార్యక్రమాల వలన మాన సిక ప్రశాంతత తో పాటు, క్రమశిక్షణ అలవాటు అవుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. మంగళవారం గాజుల రామారం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ లో ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి 22వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నగేష్, సాయిలు, గోకుల్ ప్రసాద్, గంగయ్య, సునీల్ కుమార్ వర్మ, పార్వతి, శ్యాంసుందర్, చిన్న, గంగారాం, బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయరామిరెడ్డి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, అడ్వకేట్ కమలాకర్, పరుష శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి,తెలంగాణ సాయి, నవాబ్, సుంకరి చందు, తారా సింగ్, శివ నాయక్, చందు గౌడ్, నవీన్, అసిఫ్, చిన్న చౌదరి, మక్సుద్, వేణు యాదవ్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ నేషనల్ 2026 సంవత్సరం అవార్డును అందుకున్న రేగుళ్ల సతీష్



**కాప్రా, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి, ఆయాన్ ఫౌండేష న్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి హైదరాబాద్ లో నిర్వహించిన మహాత్మా గాంధీ నేషనల్ అవార్డ్స్ 2026 సంవత్సరంలో సామాజికవేత్త, సంఘ సేవకులుగా కాప్రా కు చెందిన రేగళ్ల సతీష్ రెడ్డి కి ఈ అవార్డు అందజేశారు. ఈ సంద ర్భంగా ఈ అవార్డును ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్ నరసన్న , సీనియర్ సినిమా నటులు హసనూరి శ్రీనివాస్ సతీష్ రెడ్డికి శాలువాతో సన్మానించి అవార్డును అందజేశారు. అనంతరం సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, ప్రముఖుల చేతుల మీదుగా తీసుకోవడం నాకు ఆనందంగా ఉన్నది, రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఈ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం మున్నా, రాష్ట్ర అధ్యక్షులు నయీమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గ ప్రసాద్, వీరబోయిన రజిత , జవహర్ నగర్ కార్పొరేటర్ నిహారిక గౌడ్, బాజిరెడ్డి సినిమా నటులు, సంఘ సేవకులు, మన స్నేహం కావేరి, సుజత గౌడ్, వివిధ జిల్లాల నుండి 400 మంది వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఎన్నికలకు ఉపయోగించే సామాగ్రి పంపిణీ కేంద్రాలను సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లేతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. మంగళవారం మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి, సిబ్బంది పోలింగ్ బూతులకు నిర్ణీత సమయంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందిని కోరారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# చిట్టిగిద్ద గ్రామంలో నీ సమస్యలన్నీ 100 శాతంపూర్తి చేస్తాం..!!

**గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు..!!**



**నవాబుపేట్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** చిట్టిగిద్ద గ్రామాన్ని సమస్యలు లేని విధంగా పూర్తిగా పని చేసి ఆదర్శవంతంగా చేస్తామని గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు మంగళవారం గ్రామసభ సమావేశంలో పేర్కొన్నారు. గ్రామ సభ అధ్యక్షులు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి సమావేశాన్ని నిర్వహిస్తూఆయన మాట్లాడుతూ గ్రామంలోని పూర్తిగా అండర్ డ్రైనేజీ, సి సి కెమెరాలు, మంచి నీటి సమస్య, సిసి రోడ్లు, అంగన్వాడి భవనము, నిర్మించి సమస్యలను పూర్తి చేస్తామని ఆయన అన్నారు. గ్రామంలోని ఇప్పటివరకు మంచిగా సమస్యకు రెండు బోర్లు నూతనంగా వేసినారు. డ్వాక్రా మహిళా భవనం నిర్మాణం కొరకు 20 లక్షలు మంజూరైనాయి వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన అన్నారు. గ్రామంలోని ఉన్నాం 10 వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి వచ్చినట్లయితే వెంటనే సమస్యలను పూర్తి చేస్తామని ఆయన అన్నారు. ఎలక్షన్ మూమెంట్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేయని యెడల సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని ఆయన అన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు 5 మంది లేదా ఆరు మంది ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయులు మాత్రం ఎనిమిది మంది ఏం చేస్తున్నారు ఎవరికి అర్థం కావడం లేదని మాజీ ఎంపిటిసి ఇక్బాల్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజు గ్రామంలోకి వచ్చి రాణి విద్యార్థులను వారి ఇంటికి వెళ్లి స్కూలుకు తీసుకెళ్లే విధంగా పని చేయాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న లక్షల రూపాయలు తిని నామమాత్రం గ వచ్చి రూముల్లో ఫోను చూసుకుంటూ టైంపాస్ చేస్తున్నారని ఆయన అన్నారు. వెంటనే జీవోకు ఫిర్యాదు చేస్తామని ఆయన అన్నారు. గ్రామంలోని ప్రతి గలిగలికి సి సి కెమెరా ఏర్పాటు చేస్తామన్నారు. వీధి దీపాలు పూర్తిగా నిర్మించామని ఆయన అన్నారు. గ్రామంలోని ఉన్న ఎలాంటి సమస్యలైనా గ్రామ సభలో పంచాయతీ కార్యాలయంలో వాడు సభ్యులతో తీర్మానం చేసి ఉన్న సమస్యలను పూర్తి చేస్తామని అన్నారు. గ్రామంలోని ఏ సమస్యలున్నా పండుగలు ఉన్న అంగరంగ వైభవంగా గ్రామంలోని అందరం ఏకమై ఈ పండుగలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మాధవరెడ్డి,ఉప సర్పంచ్ జిపిఓ కళావతి, పంచాయతీ వార్డుసభ్యులు, జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్, ప్రాథమిక పాఠశా ల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది గ్రామ పెద్దలు మాజీ సర్పంచులు మాజీ, ఎంపిటిసిలు, వివిధ సంఘాల నాయకులు యువజన సంఘాల నాయకులుగ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయి

**పాఠశాల కరస్పాండెంట్ పి.శ్రీనివాస్ రెడ్డి**



**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి):** అత్యధికంగా పేద ప్రజలు నివసిస్తున్న బస్తీలలో స్వచ్ఛందసంస్థలు, దాతలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలుచేస్తాయని విద్యాంజలి పాఠశాల కరస్పాండెంట్ పి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు .మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, వెంకటరామిరెడ్డి నగర్ ప్రాంతంలో గల విద్యాంజలి పాఠశాలలో సోలాస్ ఐ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సంస్థ జనరల్ మేనేజర్ అనిల్ కుమార్,తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపకబృందం,సిబ్బంది 200 మందికి నేత్ర వైద్య నిపుణులైన డాక్టర్ గౌతమి, విక్రమ్, ఆంజనేయులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు . ఈ సందర్భంగా కరస్పాండెంట్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి(చిన్నపెద్ద)తేడా లేకుండా అస్త్రంలా మారిపోయిన మొబైల్ ఫోన్, కంప్యూటర్,ల్యాప్టాప్ లతో జ్ఞానేంద్రియాలపై ఎంతో ఒత్తిడి పెరుగుతుందన్నారు. అత్యవసరమైతేనే తప్ప..వాటి వాడకాన్ని తగ్గించు కోవాలని సూచించారు.సమాజంలో కంటి ఆరోగ్య ప్రాముఖ్యతను పెంపొందించడానికి ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. విద్యతో పాటు ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో కూడా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు.పలువురు కంటి సమస్యలపై వైద్యుల సలహాలు పొందారు. అవసరమైన వారికి చికిత్సలతో పాటు కంటి సంరక్షణకు సంబంధించిన పలు సూచనలు వైద్యులు చేశారు.అనంతరం సోలాస్ ఐ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ వైద్య బృందానికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

# బాలిక మృతికి కారణమైనవారిపై అట్రాసిటీ కేసు పెట్టాలి

## ఎస్సీ ఎస్టి కమిషన్, మానవ హక్కుల కమిషన్‌లను ఆశ్రయించిన బాధితులు

**నవాబుపేట్, ఫిబ్రవరి 10(జనంసాక్షి):** మండలం పరిధిలోని ముబారకపూర్ గ్రామంలో మైనర్ బాలిక అనిషా మృతికి కారణమైన నవాబుపేట్ మండల పరిధిలోని ముబారకపూర్ గ్రామంలో తమ కూతురు మరణానికి కారణం అయినా బిఆర్ఎస్ నవాబ్ పెట్ మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అనూష తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు మంగళవారం అంబేద్కర్ ప్రజా సంఘం అండతో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ లలో వారు దయాకర్ రెడ్డి పై ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదులో వివరాల ప్రకారం పెద్దెముల్ మండలం, చైతన్య నగర్ కు చెందిన మాదాసు లక్ష్మి కిష్టయ్య దంపతులు వారి కుమార్తె అనూష (14) తో కలిసి గత కొంతకాలంగా నవాబ్ పేట్ మండలం ముబారక్ పూర్ గ్రామంలో దయాకర్ రెడ్డి వద్ద పొలం పనులు చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో గత జనవరి 28వ తేదీ పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్ పై వెళుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదంలో అనూష అక్కడికక్కడే మరణించింది. 14 సంవత్సరాలు నిండని అనూషను బలవంతంగా దయాకర్ రెడ్డి పని చేయించుకోవడం వల్లనే ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మమత అనే మరో మహిళ కాలు విరిగింది. ప్రమాదం జరిగిన నాటి నుండి మమత తో పాటు మరో ముగ్గురిని దయాకర్ రెడ్డి రహస్య ప్రదేశంలో బంధించి వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ ప్రమాదంలో మమత అనే మరో మహిళ కాలు విరిగింది. ప్రమాదం జరిగిన నాటి నుండి మమత తో పాటు మరో ముగ్గురిని దయాకర్ రెడ్డి రహస్య ప్రదేశంలో బంధించి వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ సంఘటనలో తనకు అనుకూలంగా చెప్పాలని వేధిస్తుంటే అతని నిర్బంధంలో ఉన్న గంగమ్మ అనే మహిళ తప్పించుకుని గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం మాట్లాడుతూ చట్టాలను ఉల్లంఘించి బాల కార్మికులతో పని చేయించుకుని, ఆమె మరణానికి కారణం అయినా దయాకర్ రెడ్డి పై ఖచ్చితంగా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమం కోసం పనిచేయాలని, సంపన్నులకు అండగా నిలుస్తూ పేదలకు అన్యాయం చేయకూడదని అన్నారు. దయాకర్ రెడ్డి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసే వరకు న్యాయబద్ధమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల్ అంబే ద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఆనందం, ఉపాధ్యక్షులు శివరాజ్, జంగం వెంకటేష్, చైతన్య నగర్ గ్రామస్తులు బుచ్చయ్య, హనుమంతు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల అరాచకానికి బిజేపి అభ్యర్థి మహాదేవప్ప బలీ

**బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి మున్సిపల్ ఇంచార్జ్ కోరేటి కిషోర్ రెడ్డి**



**తాండూరు (జనంసాక్షి):** కాంగ్రెస్ నాయకుల అరాచకానికి భారతీయ జనతా పార్టీ మక్తల్ ఆరో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మహాదేవప్ప బలీఅయ్యారని బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ కోరేటి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూర్ పట్టణం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ కోరేటి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఒకరోజు ముందే ఆరో వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రేపు ఎన్నికలు ఉంటే ఒకరోజు ముందే చనిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. కుటుంబ సభ్యులు తనతో వివరిస్తూ కాంగ్రెస్ నాయకులు మహదేవప్పను తీవ్ర మనస్తా పానికి గురి చేశారని వివరించారు. కాంగ్రెస్ నాయకుల వ్యత్తడికి లోనై ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు కాంగ్రెస్ నాయకులు ప్రజల హక్కులను కాలరాస్తూన్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు రావణి ముందే గ్రహించి లేనిపోని అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల బౌతవ్యం మున్సిపల్ ఎన్నికల పై అదారపడి ఉందని ఒత్తిడి గురి చేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతామనిగ్రహించి ఆరాచకాలకు తెర లేపారు.తాండూరు మున్సిపాలిటిలో బిజెపి నాయకులకు బద్రత కల్పించాలని, ప్రజాసామాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్ రావు, పటేల్ విజయ్ కుమార్ ,శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# గాజులరామరంలో భూకంపం నిజమా? వదంతులా ?

**నిర్మాణం కోసం బ్లాస్టింగ్ లా?**

**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని మెట్కానీ గూడ, పరిసర ప్రాంతాలలో భూకంపం సంబంధించిన వదంతులు మంగళవారం దావానంలా వ్యాపిం చాయి. ఉదయము 10 గంటల 16 నిమిషాల సమయంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో కొన్ని సెకండ్స్ లా పాటు భూమి కనిపించిందని స్థానికులు తెలిపా రు. భారీ శబ్దం రావడమే కాకుండా తమ కాళ్ళ కింద భూమి కదిలినట్లు అనిపి ంచిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. తమకు ఏమి జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఇంట్లో నుండి బయటకి పరిగెత్తినట్లు తెలిపారు. ఇప్పటివరకు సంబంధిత అధికారులు భూకంపం వచ్చినట్లుగా అధికారికంగా ప్రకటించలేదు. సంఘటన స్థలం పరిసర ప్రాంతమైన ప్రగతి నగర్ లో సునామి హెచ్చరిక కేంద్రం ఉన్నప్పటికీ వారు ఇంతవరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

**నిర్మాణం కోసం చేపట్టిన బ్లాస్టింగ్ అయి ఉండవచ్చు ?**

ఈ ప్రాంతం ఒకప్పుడు పూర్తిగా క్వారీ గుంతలతో ఉండేది. అయితే ఇక్కడ క్వారీ గుంతలను పూడ్చుకొని ఇల్లు నిర్మాణాలు చేపట్టుకుని నివసిస్తున్నారు. ఇక్కడ చాలా కాలనీలు క్వారీ గుంతల పూడ్చివేతతో ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో ఎవరైనా బిల్డింగ్ గుంతల కోసం బ్లాస్టింగ్ పనులు చేపట్టడం వలన భూమికపించి ఉండవచ్చని స్థానికంగా కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మాజీసైనికుల సమస్యల పరిష్కారానికి సమావేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):** మాజీసైనికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి ఫిబ్రవరి 11న హైదరాబాద్ సోమాజీగూడలోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్మీ నుండి కొందరు అధికారులు ఫిబ్రవరి 11 ఉదయం 11 గంటలకు ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి విచ్చేయనున్నట్లు వెల్లడించారు. పెన్షన్ సమస్యలు లేదా ఇతర సమస్యలు ఉన్న మాజీసైనికులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి తెలిపారు.

# లేబర్ కోడ్‌లు అందరి హక్కులకు ముప్పు


## పోరాటాల నుంచే కార్మిక చట్టాలు పరిరక్షించుకోవాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య





**నాచారం (జనంసాక్షి) :** ఉద్యమాలు, పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు, చట్టాలు సాధ్యమయ్యాయని, ఈ చారిత్రక సత్యాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ మంగళవారం నాచారం చౌరస్తాలో నాచారం ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ జిల్లా సీఐటీయూ కోశాధికారి పి.గణేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్మిక సదస్సులో ఎస్.వీరయ్య ముఖ్య వ్యక్తగా హాజరై ప్రసంగిస్తూ.. కార్మికుల రక్తత్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్ లాభాల కోసం రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు అమలైతే ట్రేడ్ యూనియన్ హక్కులు, ఉద్యోగ భద్రత పూర్తిగా దెబ్బతింటాయని హెచ్చరించారు. పర్మినెంట్ ఉద్యోగాలను తొలగించి కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్ ఉపాధిని శాశ్వతం చేయాలన్న ప్రభుత్వ యత్నం కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసత్వంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నారు. షాహీ పరిశ్రమలో 1,600 మంది మహిళా కార్మికులు ఎలాంటి యూనియన్లకు చెందకుండానే తమ వేతనాల కోసం పది రోజుల పాటు రాత్రింబవళ్లు పోరాడి హక్కులు సాధించుకున్న ఉదాహరణను ఆయన గుర్తు చేశారు. పోరాటం లేకుండా హక్కులు లభించవని ఇది స్పష్టంగా నిరూపిస్తోందన్నారు. లేబర్ కోడ్ల పేరుతో కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం 2026 ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఏఐటీఈయుసి రాష్ట్ర నాయకులు వి.ఎస్.బోసు మాట్లాడుతూ.. కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలేనని, కార్పొరేట్ లాభాల కోసం కార్మిక హక్కులు, రైతు ప్రయోజనాలను తాకట్టు పెడుతూ, లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లుల రూపంలో దాడి చేస్తోందని విమర్శించారు. ఈ విధానాలను వెనక్కి తీసుకునే వరకు కార్మికులు--రైతులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఐఎన్టీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ వర్గాల ఒత్తిడికి లోబడి కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లు, ఇతర ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు పోరాటం తప్పదని, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే కార్మిక వర్గంపై పెరుగుతున్న దాడులకు కారణమని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, ఐ ఎఫ్ టి యు నాయకుల శివబాబు, ప్రవీణ్, ఎన్ ఐఈయు అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ రావు, సిఐఈయు అధ్యక్షుడు బివి సత్యనారాయణ, ఏపీరాక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ మణికంఠ, వాయిత్ ఇండియా యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యంగౌడ్, కాకతీయ కెమికల్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గ్రో కంట్రోల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యం.డి.షకీల్, హార్డ్కేస్ ఇంజినీరింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్, నాచారం, మల్లాపూర్ ఏరియా కార్మిక సంఘాలు వివిధ పరిశ్రమ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లేబర్ కార్డుతో లేబర్‌కు భద్రతా భరోసా




దినసరి కూలీగా పనిచేస్తున్న వారి జీవితం ప్రతిరోజూ యుద్ధమే, కుటుంబ పోసిన కోసం అనుక్షణం పోరాడుతుంటారు, ప్రతి రోజు పని దొరికితేనే ఇంట్లో పొయ్యి వెలుగు తుంది, పనిలేకపోతే ఆలోచనల తోనే అర్ధాకలితోనే రోజును సాగదీయాలి. ఇంకా పని చేసే చోట అనుకోని ప్రమాదాలు జరిగితే బ్రతుకు సాగడానికి గగనం అవుతుంది, ఇంట్లో ఏదైనా శుభకార్యం చేయాలి అనుకున్నా, కష్టంలో సహాయం చేయడానికి మార్గాలను అన్వేషిస్తూ ఉండాలి. అలాంటి కూలీలకు భరోసానే లేబర్ కార్డు. లేబర్ కార్డ్ (కార్మిక కార్డు) అనేది నిర్మాణ మరియు అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు కార్డు. లేబర్ కార్డు ఎన్నో ప్రయోజనాలు ఇది బీమా, ఆరోగ్య సంరక్షణ, పిల్లల విద్య, వివాహం, ప్రసూతి ప్రయోజనాల వంటి సంక్షేమ పథకాలను పొందడానికి,, భవన నిర్మాణ కార్మికులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్డు కోసం ఆన్‌లైన్‌లో (TBOCWWBపోర్టల్) లేదా సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రమాద బీమా ద్వారా పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే మరణానికి రూ. లక్షల్లో నష్టపరిహారం లేదా గాయాలైతే వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం లభిస్తుంది. కార్మికుల పిల్లల చదువుకు స్కూల్ స్థాయి నుంచి ఉన్నత విద్య స్థాయి వరకు వార్షిక స్కాలర్‌షిప్‌లు అందుతాయి. కార్మికుల కుమార్తెల వివాహం కోసం ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందుతుంది. మహిళా కార్మికులకు లేదా కార్మికుల భార్యలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సాయం లభిస్తుంది. కార్మికులకు మరియు వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం, ఆసుపత్రి ఖర్చుల కోసం సాయం అందుతుంది. స్వంత ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుండి ప్రత్యేక సాయం పొందవచ్చు. లేబర్ కార్డు పొందాలనుకుంటే గత ఒక సంవత్సరంలో కనీసం 90 రోజులు నిర్మాణ కార్మికునిగా పనిచేసి ఉండాలి. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, వయస్సు ధృవీకరణ పత్రం, ఫోటోలు. లేబర్ కార్డు పొందినవారు ప్రతిసంవత్సరం లేబర్ కార్డును రెన్యూవల్ చేసుకుంటేనే ప్రయోజనాలు నిరంతరంగా అందుతాయి. కార్మికులందరూ లేబర్ కార్డు తీసుకొని తమ కుటుంబ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలి. ఇది హక్కు మాత్రమే కాదు.. రేపటి జీవితానికి భరోసా.



**డాక్టర్. వై.సంజీవ కుమార్,**
**ఫౌండర్, ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్**
**9393613555, 9493613555**

# మహానగర అభివృద్ధిలో ఆమె

## అన్నిరంగాల్లో పురోగతికి ఐదేళ్లపాటు అవిశ్రాంత సేవ



- బస్తీ మొదలు ప్రతీ డివిజన్ సమస్యపై తక్షణ స్పందన
- ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులతో మమేకమై కార్యాచరణ
- జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రమ, పదవీకాలం స్ఫూర్తిదాయకం

**సికింద్రాబాద్ (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) డిప్యూటీ మేయర్‌గా ఐదేళ్ల పాటు నిరంతర సేవలందించిన మోతె శ్రీలత శోభన్ రెడ్డి పదవీకాలం మంగళవారం అధికారికంగా ముగిసింది. ఈ సందర్భంగా జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తన పదవీకాలాన్ని సఫలీకృతం చేయడంలో సహకరించిన మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, ప్రజాప్రతినిధులు, జిహెచ్ఎంసి కమిషనర్లు, ఉన్నతాధికారులు,ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు, కార్యాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు, అలాగే నగర ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను ప్రజాసేవే పరమావధిగా భావించి నిర్వర్తించానని ఆమె పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధి, రహదారి విస్తరణ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, మురుగునీటి శుద్ధి కేంద్రాల అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుదల, చెత్త నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగం వంటి కీలక రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుండి నడిపించారు.



పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ దంపతులు

ప్రత్యేకంగా 2020, 2021 సంవత్సరాల్లో సంభవించిన భారీ వర్షాలు, వరదల సమయంలో సహాయక చర్యలను సమన్వయం చేస్తూ, ప్రభావిత ప్రాంతాల్లో సహాయ శిబిరాలు ఏర్పాటు చేయడం, తక్షణ సహాయం అందించడం, పునరావాస చర్యలు చేపట్టడం ద్వారా బాధిత కుటుంబాలకు ధైర్యం చేకూర్చారని అధికారులు గుర్తుచేశారు. వరద నివారణ చర్యల్లో భాగంగా నాలాల అభివృద్ధి, బాక్స్ డ్రైన్ల నిర్మాణం, అక్రమ కట్టడాల తొలగింపు, వర్షపు నీటి సత్వర ప్రవాహానికి మార్గాలు కల్పించడం వంటి కీలక నిర్ణయాలు అమలు చేశారని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ, స్వయం సహాయక సంఘాల బలోపేతం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు, బాలికల విద్యకు ప్రోత్సాహం, మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. అలాగే వృద్ధులు, వికలాంగులు, నిరుపేద వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను ప్రజలకు చేరువ చేశారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరవ్యాప్తంగా భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు, పార్కుల అభివృద్ధి, సరస్సుల పునరుజ్జీవనం, జీవ వైవిధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించారని అన్నారు.

కోవిడ్ 19 మహమ్మారి సమయంలో నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ముందుండి పనిచేస్తూ, శానిటైజేషన్ డ్రైవ్స్, ఉచిత ఆహార పంపిణీ, క్వారంటైన్ కేంద్రాల పర్యవేక్షణ, వైద్య సేవల సమన్వయం వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు రక్షణ సామగ్రి అందజేయడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపారని అధికారులు తెలిపారు. ఈరోజుతో జిహెచ్ఎంసి ఎన్నికైన పాలకవర్గం ఐదేళ్ల పాలన కూడా ముగియనుంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి నాయకత్వంలో కొనసాగిన ఈ పాలకవర్గం నగరాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో విశేషమైన పురోగతి సాధించి, హైదరాబాద్‌ను మరింత ఆధునిక నగరంగా తీర్చిదిద్దే దిశగా గట్టి అడుగులు వేసిందని పలువురు అభిప్రాయపడ్డారు.